# వీలునామా

–సి. హెచ్. శివరామ ప్రసాద్

శోభనాద్రికి అవసాన కాలం సమీపించింది. రక్తం లేక వెలసిపోయిన చీరలా వుంది అతని ముఖం. కళ్ళల్లో కళ మాయమై గాజు గోలీల్లా కనిపిస్తున్నాయి. రెప్పలు మూత పడిపోతున్నాయి. ఆయాసం ఎక్కువై వూపిరి పీల్చుకోవడానికి కష్టపడుతున్నాడు. మంచంలో నుంచి తనంతట తను లేవలేని శక్తిహీనుడయ్యాడు.

''నాన్నా! కాసిని పాలైనా తాగు'' అని కూతురు బలవంతంగా స్పూనుతో నోట్లో పోస్తోంది.

దగ్గు తెరలు ముంచుకొస్తున్నాయి. పాలన్నీ బైటకొచ్చేసి బుగ్గల మీదుగా కారిపోతున్నాయి.

''వద్దమ్మా! ఇంకేమీ వద్దు. ఇక నా పనైపోయింది'' అతి కష్టం మీద అన్నాడు.

తొందరగా ప్రాణం పోతే బాగుండు. లేకపోతే ఈ మంచంలో నరకం ఎన్నాళ్ళు? 'ఈ ముసలోడు ఎప్పుడు పోతాడా?' అని ఎదురు చూస్తున్నారని అతనికి తెలుసు. తనకి సేవలు చేయలేక విసుక్కోకముందే పోతే బాగుంటుంది. కాని అది తన చేతిలో లేదుగా! పోనీ ఆ డాక్టరైనా తన నోట్లో చిటికెడు విషం పోస్తే బాగుండును.

శోభనాద్రి మనసు బాధగా మూలిగింది.

అతని సన్నిహిత మిత్రుడు లాయర్ విశ్వనాథం కోసం కబురు చేశాడు. విశ్వం రాగానే వీలునామా రాయించాలి. అప్పుడుగాని తనకి తృప్తిగా వుండదు. ఇక ఆ తర్వాత హాయిగా కన్నుమూస్తాడు. తను పోయిన తర్వాత కొడుకులు, కూతురు, కీచులాడుకోవడం, మాటా మాటా అనుకోవడం, మనస్తాపం చెందడం తనకి ఇష్టం లేదు.

'దేవుడు స్వర్గాన్ని పరిపాలిస్తుంటే, భూమిని బంగారం పాలిస్తున్నదనేది' నిత్య సత్యం.

డబ్బుతోనే మానవ సంబంధాలు ముడిపడి వున్నాయి. డబ్బు మనుషుల మధ్య ఆత్మీయతను దూరం చేస్తుంది. రక్త సంబంధాలను సైతం అపహాస్యం చేస్తుంది. డబ్బుతోనే మనిషి మనుగడ.

డెబ్బై ఏళ్ళు దాటినా నెల రోజుల క్రితం వరకూ శోభనాద్రి ఆరోగ్యంగానే వున్నాడు. ఒక రోజు మాయదారి జ్వరం ముంచుకొచ్చింది. అంతే! అప్పట్నుంచి క్రుంగిపోయాడు. మళ్ళీ కోలుకోలేదు. డాక్టర్లు కూడా పెదవి విరిచారు. అయినా ఏవో మందులు మింగిస్తున్నారు. శరీరాన్ని సూదులతో తూట్లు పొడుస్తున్నారు.

తనకి రోజులు దగ్గరికొచ్చాయనే సంగతి శోభనాద్రికి తెలిసిపోతూనే వుంది. చివరి రోజులలో ఆ విషయం ఎవరైనా అర్థం చేసుకుంటారు.

అతనికి అర్థం కానిది తన పిల్లల మనస్తత్వమే.

తను వాళ్ళ కోసం జీవితం ధార పోశాడు. స్వ సుఖాలు త్యాగం చేసి పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేశాడు. తను చెప్పులు అరిగేటట్లు కాలినడకన తిరుగుతూ వాళ్ళకి సైకిళ్ళు కొనిచ్చాడు. చిరిగిన బట్టలు కుట్టుకుంటూ కాలక్షేపం చేసి పిల్లలకి కొత్తబట్టలు కొనిచ్చాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తన రక్తాన్ని చెమటగా మార్చి వాళ్ళకి సౌకర్యాలు సమకూర్చాడు. డబ్బు సంపాదించడం కోసం తిట్లు, శాపనార్థాలు అవమానాలు భరించాడు.

అయినా ఏం లాభం? గుప్పిట మూసి వుంచలేకపోయాడు. ఏ మనిషైనా తను పోయాక అయ్యే ఖర్చుల కోసం డబ్బు దాచి వుంచాల్సిన అవసరం వుంటుందనేది కలలో కూడా వూహించలేని విషయం. తండ్రి పోయాక తమకి మిగిలేది బూడిదేనని తెలుసుకున్న పిల్లలు డబ్బు గురించి కీచులాట ప్రారంభించారు. దిన వారాలు చెయ్యడానికి బాధ పడుతున్నారు. అమ్మో! ఇంత ఖర్చా? అని గుండెలు బాదుకుంటున్నారు. నీకు ఎక్కువ చేశాడనీ, నాకు తక్కువ చేశాడనీ దెప్పి పొడుచుకుంటున్నారు.

శోభనాద్రి శరీరం శుష్కించి పోయినా మెదడు పనిచేస్తున్నది. అందర్నీ చూడగలుగుతున్నాడు. వాళ్ళ మాటలు గుండెని తూట్లు పొడుస్తున్నాయి.

ముసలాయన బాధ పడతాడేమోనన్నైనా ఆలోచించకుండా తనముందే పోట్లాడుకోవడం అతని మనసుని అగ్నిలా దహించి వేస్తున్నది. చనిపోకముందే వాళ్ళ దృష్టిలో తనొక శవంతో సమానమన్న నిజం అతని గుండెని తొలిచి వేస్తున్నది.

> ''ఇల్లు నాకు పసుపు కుంకుమ కింద ఇచ్చాడు నాన్న. అయినా గాని నాన్న మా ఇంట్లోనే వుంటున్నాడు. ఎన్నేళ్ళ నుంచి పోషిస్తున్నాము మేము. మీరెప్పుడైనా పట్టించుకున్నారా?''

తండ్రికి సీరియస్‌గా వుందనీ, రోజుల్లో వున్నాడనీ కబురందుకుని కొడుకులిద్దరూ హైదరాబాద్ వచ్చారు. ఏదో మొక్కుబడిగా పలకరించి, మంచం దగ్గర పది నిముషాలు నిల్చున్నారు. ఇక ఆ తర్వాత మొదలైంది కీచులాట.

''ఏరా! చిన్నోడా, డబ్బెంత వుంది నీ దగ్గర?''

''నా దగ్గరేం వుంది అన్నాయ్? వచ్చే జీతం ఖర్చులకే చాలడం లేదు. నీకు తెలుసుగా! బొంబాయిలో జీవితం ఎంత నరకమో? తిండికంటే పై పై ఖర్చులకు ఎక్కడి డబ్బూ చాలడం లేదు. అక్కడికీ మీ మరదలు బట్టలు కుట్టి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా సంపాదిస్తున్నది కాబట్టి గుడ్డిలో మెల్లగా వుంది. అద్దెలు కట్టలేక ఒక్క గదిలోనే మురిగి చస్తున్నాం అనుకో. నువ్వూ చూశావుగా! పోయిన సారి నువ్వు బొంబాయి వచ్చినప్పుడు అడగలేదూ! 'ఎట్లా వుంటున్నార్రా ఈ గదిలో అనీ..'

''అవన్నీ ఇప్పుడెందుకురా! నేనడిగింది డబ్బు ఏమైనా వుందా అని. నువ్వేమో నీ బాధలన్నీ వెళ్ళబోసుకుంటున్నావు. బాధలు లేని వాళ్ళెవరు ఈ లోకంలో? ఎవరి కష్టాలు వాళ్ళకుంటాయి. పేరుకే లెక్చరర్‌ని గాని ఏం లాభం? ఇన్నాళ్ళ నుంచి వుద్యోగం చేస్తున్నా బెజవాడ శివార్లలో కూడా ఇంటి స్థలం కొనుక్కోలేక పోయాను. ఇక ఇల్లు కట్టే యోగం వుందో లేదో?''

''ఎంత చెట్టుకు అంతగాలి.''

''మన బాధలు ఎవరికి కావాలి? నాన్న ఇవాళో రేపో పోతాడు. మరి ఆ తర్వాత ఖర్చులు ఎవరు భరించాలి? పోగానే ముందు మట్టి ఖర్చులు బోలెడుంటాయి. స్మశానానికి తీసుకెళ్ళడానికి, అక్కడ కట్టెలు కొనడానికి, నెయ్యి, పూలదండలు, కాటి కాపరికి ఇవ్వాలి. మర్చిపోయా! మేళాల వాళ్ళు ఎంత అడుగుతారో? ఇక చిన్నదినానికి బంధువులందర్నీ పిలిచి భోజనాలు పెట్టాలి. పెద్ద దినానికి ఈ బస్తీలో అందర్నీ పిలవాలి. ధరలు మండిపోతున్నాయి. పాతిక, ముప్పైవేలు అవుతాయి.''

''అవుతాయేమో?''

''అవన్నీ నేనొక్కడినే భరించగలనా? ఇంటికి పెద్దవాడినని బరువంతా నామీద పడేస్తే మొయ్యగలనా?''

''ఏం భరిస్తే! పెద్ద లెక్చరర్‌వి. బోలెడు జీతం వస్తున్నది.''

''నా జీతం సంగతెందుకు? నువ్వు మాత్రం ఆయన కొడుకువి కాదా! ఆయనకి పుట్టలేదా?''

''ఇప్పుడేమంటావు?''

''సగం ఖర్చు నువ్వు భరించు.''

''అంటే పదిహేను వేలు. అమ్మ బాబోయ్! నేనెక్కడ్నుంచి తేనూ? నువ్వు నమ్మితే నమ్ము, లేకపోతే లేదు. ఈ రోజు వరకు మేము కలర్ టీవీ కొనుక్కోలేక పోయాం. మిక్సీ పాత డొక్కయిపోయింది. కొత్తది కొనడానికి కుదరడం లేదు. దాన్నే మాటి మాటికీ బాగుచేయించి వాడుకుంటున్నాం. ఎయిర్‌కూలర్ లేక ఎండాకాలం మాడిపోతున్నాం. అదే మీ ఇంట్లో ఎంత సామానువుంది? కలర్ టీవీ, వాషింగ్‌మిషన్, రెండు ఎయిర్ కండిషనర్లు,

రుబ్బింగ్ మిషను, సోఫాలు, డైనింగ్ టేబుళ్ళు, డబుల్ కాట్లు..పైగా నువ్వు హీరో హోండా మెయింటైన్ చేస్తున్నావు. నేను గంటల తరబడి బస్టాప్‌లో చస్తూ సిటీ బస్‌లో ఫ్యాక్టరీకి వెళ్తున్నా తెలుసా?''

''నా ఇంట్లో సామాను సంగతెందుకూ నీకు? నా స్టేటస్‌కి అవన్నీ అవసరం. డబ్బుండి కొన్నాననుకుంటున్నావా? చెప్తుకుంటే సిగ్గుచేటు. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో తీసుకుని అప్పులు తీర్చలేక చస్తున్నా..''

అన్నదమ్ములిద్దరూ అరగంట వాదించుకున్నారు. ఏం తేల్చుకుంటారో చూద్దామని వాళ్ళ భార్యలు ఆసక్తిగా వింటున్నారు. పెద్దకొడుక్కి ఖర్చు భరించే కెపాసిటీ వున్నా సగం మాత్రమే ఇవ్వమని అతని భార్య నూరిపోసింది. డబ్బు కూడబెట్టుకుంటున్నారనుకుంటారని నెక్లెస్, గాజులు, వుంగరాలు వగైరా బంగారు నగలు లాకర్లో దాచి వచ్చింది. సగం ఖర్చు ఇవ్వాల్సిన బాధ్యత వున్నా, ఆ పాటి డబ్బు ఇవ్వగలిగిన స్థితిలో వున్నా కూడా పెద్దాయన మీదకు అంతా నెట్టెయ్యమని చిన్నాయన భార్య భర్తకి ఎక్కించింది.

''పోనీ మట్టి ఖర్చు బావని పెట్టుకోమంటే?'' చిన్నకొడుకు సలహా ఇచ్చాడు.

''బాగుంటుందా?'' పెద్దకొడుకు సందేహిస్తూ అన్నాడు.

''ఎందుకు బాగుండదూ? నాన్న వాళ్ళకి ఇల్లు ఇచ్చాడు. ఆ ఇంట్లోనే వుంటున్నారు. అద్దె ఖర్చు లేకుండా హాయిగా వుంది వాళ్ళ పని.''

అది విని ఎక్కడ్నుంచి వచ్చిందో చెల్లెలు. అన్నల మీద విరుచుకు పడింది.

''ఇల్లు నాకు పసుపు కుంకుమ కింద ఇచ్చాడు నాన్న. అయినా గాని నాన్న మా ఇంట్లోనే వుంటున్నాడు. ఎన్నేళ్ళ నుంచి పోషిస్తున్నాము మేము. మీరెప్పుడైనా పట్టించుకున్నారా?''

''దూరాన వున్న వాళ్ళం ఏం పట్టించుకుంటాం? రైళ్ళు, బస్సులు మన తాతలివి కాదు. వచ్చి పోవాలంటే వేలు ఖర్చవుతాయి. అయినా ఇన్నాళ్ళూ నాన్నకేమైందనీ? కాళ్ళు చేతులూ బాగానే వున్నాయిగా. మహా అయితే ఇంత ముద్దపడేశారు. ఇప్పుడేగా మూలనపడిందీ? నువ్వయినా వూరికినే పెట్టావా? మేము అప్పుడప్పుడు పంపించే డబ్బు ఏమైందీ? మీకేగా ఖర్చు పెడుతున్నాడు?'' కోడళ్ళు ఆడబిడ్డకి సమాధానం చెప్పారు.



తమ భార్యలు రంగంలోకి దిగాక మగవాళ్ళు వినోదంగా చూస్తూ కూర్చున్నారు. ఇద్దరు వదినలతో వాదించలేక ఒంటరిదైపోయిన కూతురు ఆఖరి అస్త్రంగా ఏడుపు బాణం వదిలింది. కళ్ళు తుడుచుకుంటూ, ముక్కు చీదుతూ యుద్ధం సాగించింది.

మంచంలో వున్న శోభనాద్రికి వాళ్ళ మాటలు తుపాకీ గుళ్ళలా దూసుకొచ్చి తూట్లు పొడుస్తున్నాయి. లేచి వెళ్ళడానికి శక్తిలేదుగాని లేకపోతే అక్కడ్నుంచి పారిపోయి ఏ హుస్సేన్ సాగర్లోనో దూకి ఆత్మహత్య చేసుకునేవాడు.

''భగవంతుడా నేనేం పాపం చేశాను? చివరిరోజుల్లో నాకెందుకీ క్షోభ?''

శోభనాద్రి కళ్ళల్లో నుంచి ఆగకుండా కన్నీరు కారుతోంది.

★★★


శోభనాద్రికి పదేళ్ళ వయసులోనే తల్లిపోయింది. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లికి నలుగురు సంతానం కలిగారు. అతని తండ్రి టైలర్. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించడానికి రాత్రింబగళ్ళు బట్టలు కుట్టేవాడు. అయినా ఇల్లుగడవడం కష్టంగానే వుండేది. దరిద్రం వల్ల పిల్లల కోరికలు తీరేవి కావు. తోటి పిల్లల జీవితంతో పోల్చుకుంటే అసంతృప్తిగా వుండేది. ఇల్లు ఇరుకు. పిల్లలు గోల చేస్తుండేవాళ్ళు. చదువుమీద శ్రద్ధ వుండేది కాదు.

''వాడికిక చదువొద్దు. బట్టలు కుట్టడం నేర్పిస్తే ఇంత సంపాదిస్తాడని'' సవతి తల్లి పోరు పెట్టేది.

అప్పట్లో హైస్కూలు చదువుకి నెల నెలా ఫీజులుండేవి. ఆర్నెల్లకొకసారి స్పెషల్ ఫీజులంటూ కట్టాల్సి వచ్చేంది. అచ్చుపుస్తకాలు కొనడం, నోట్సులకనీ, పెన్నులకనీ డబ్బు ఖర్చు పెట్టడం వారికి భారంగానే వుండేది. ఇప్పటిలాగా అటెండెన్స్‌లో పై క్లాసుకి ప్రమోషన్ వుండేది కాదు. ఆరో తరగతి నుంచి ప్రతి ఏడూ ప్యాసైతేనే పై క్లాసుకి వెళ్ళేవాళ్ళు. ఒక్కో తరగతీ రెండు, మూడేళ్ళు చదివే వాళ్ళూ వుండేవాళ్ళు. మొద్దబ్బాయిలు స్కూలు ఫైనల్‌కి వచ్చేసరికి పాతికేళ్ళు వచ్చేవి. పడుతూ లేస్తూ శోభనాద్రి స్కూల్ ఫైనల్ దాకా దేకాడు. కాని గట్టెక్కలేకపోయాడు.

''ఇక చదువు చాల్లే. టైలరింగ్ నేర్చుకో''
అన్నాడు తండ్రి.

శోభనాద్రికి టైలరింగ్ అంటే ఇష్టం లేదు. రాత్రింబవళ్ళు చెమటలు కార్చినా తండ్రి ఏం సంపాదిస్తున్నాడు? అనుకునేవాడు. ఆ సమయంలోనే అతని క్లాస్‌మేట్ గోపాల్ రామాటాకీస్‌లో బుక్కింగ్ క్లర్కుగా చేరాడు. వేకెన్సీ రాగానే శోభనాద్రిని గూడా చేర్పించాడు. ముప్పై రూపాయల జీతం కన్నా టాకీస్‌లో వుద్యోగం థ్రిల్లింగ్‌గా వుండేది. బుక్కింగ్ పూర్తయ్యాక రోజూ సినిమా చూడడం, అప్పుడప్పుడు తన తమ్ముళ్ళని, తల్లిని ఫ్రీగా సినిమాకి పంపడం







గొప్పగా ఫీలయ్యేవాడు. కొత్త సినిమా వచ్చినప్పుడు టిక్కెట్లు ఇప్పించమని ఫ్రెండ్స్ వెంబడి పడుతుంటే ఏనుగెక్కినంత సంబరం కలిగేది.

కొన్నాళ్లకి రంగనాయకులని ఒక సినిమా రిప్రజెంటేటివ్ అతనికి క్లోజ్ ఫ్రెండయ్యాడు. అతనికి డిస్ట్రిబ్యూటర్లు ఇచ్చే జీత భత్యాలు కాక, సినిమాహాల్లో బేటా ఇచ్చేవాళ్ళు. అదీగాక ఫ్రాడ్ చేసి కొంతరాబట్టుకునేవాడు. ఆ డబ్బుతో జల్సా చేసేవాడు. ఆ పరిసరాల్లో వ్యభిచార గృహాలు పావనం చేసేవాడు. ఈ చేత్తో సంపాదించి ఆ చేత్తో ఖర్చు పెట్టేవాడు. రంగనాయకులి జీవిత సరళి శోభనాద్రిని ఆకర్షించింది. అతను గోపికలతో సరసాలాడే శ్రీకృష్ణుడిలా కనిపించేవాడు. నవ్వుతూ నవ్విస్తూ అందరితో కలసి మెలిసి తిరుగుతూ కులాసాగా వుండేవాడు. జీవితం అంటే అట్లా నిత్యకళ్యాణం పచ్చతోరణంలా వుండాలనుకున్నాడు శోభనాద్రి. తను గూడా సినిమా రిప్రజెంటేటివ్ కావాలని కలలుగన్నాడు. రంగనాయకులు దగ్గర శిష్యరికం చేశాడు. డి.సి.ఆర్ (డైలీ కలెక్షన్ రిపోర్టు) రాయడం, కంపెనీకి రావాల్సిన షేర్ తీసుకోవడం, వీక్లీ రిపోర్టులు కంపెనీకి పంపడం, హాల్లో జనాన్ని లెక్కపెట్టడం, డిస్ట్రిబ్యూటర్‌కి తెలియకుండా హాలు మేనేజర్‌తో కుమ్మక్కయి ఫ్రాడ్ చేయడం వగైరా విద్యలన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నాడు.

అవి ఆంధ్రప్రదేశ్ ఏర్పడి హైదరాబాద్ రాజధాని అయిన కొత్త రోజులు. విజయవాడలో జయాకంపెనీ ప్రొప్రయిటర్ పార్థసారధి సికింద్రాబాద్‌లో కొత్తగా ఆఫీసు పెట్టాడు. కొత్త కుర్రవాళ్ళు కావాల్సి వచ్చారు. రంగనాయకులు పార్థసారధికి శోభనాద్రిని పరిచయం చేశాడు. ఆ విధంగా అతను జయా కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా సికింద్రాబాద్ చేరుకున్నాడు.

ఆరోజుల్లో శోభనాద్రి ఎట్లా వుండేవాడు? ఆరడుగుల అందగాడు. పెళ్ళికాని కుర్రాడు. చేతినిండా డబ్బు ఆడుతుండేది. సికింద్రాబాద్‌లో రిప్రజెంటేటివ్‌లు వందలమంది వున్నా శోభనాద్రి మాత్రం ఫేమస్ హీరో వారిలో. అతన్ని 'సొగ్గాడు శోభనాద్రి' అని పిలిచేవాళ్ళు. అంత ట్రిమ్ముగా తయారయ్యేవాడు. ఆ రోజుల్లో కింగ్స్‌వేలో బాటా కంపెనీ అంబాసిడర్ బూట్లు వేసుకునేది ఒక్క శోభనాద్రే. గాబార్డియన్, ఫులెన్ ప్యాంట్లు, రెడీమేడ్ గీతల షర్టు వేసుకుని టిప్‌టాప్‌గా వుండేవాడు. అప్పట్లో విజయవాడలో మందు దొరికేది కాదు. ప్రొహిబిషన్ వుండేది. రాజధాని వచ్చాక విస్కీ కొట్టడం నేర్చుకున్నాడు. శృంగార చేష్టలు ఎటూ వుండేవి. కేంపుల్లో డబ్బు సంపాదించి జల్సాలు చేసేవాడు. ఇంటికి వెళ్ళినప్పుడు తండ్రికి డబ్బు ఇచ్చేవాడు. తమ్ముళ్ళకు బట్టలుకొని పెట్టేవాడు. ప్రతి సంక్రాంతికి సవతి తల్లికి ఏదోక బంగారు నగ కొనేవాడు. ఒకసారి గాజులు మరొకసారి నెక్లెస్ అట్లా. సవతి తల్లి అతన్ని 'బంగారు కొండ'ని మెచ్చుకునేది.

జయా కంపెనీలో పడడమే శోభనాద్రి అదృష్టం అనాలి. ప్రొప్రయిటర్ పార్థసారధి వ్యవహార సరళి అందరి కంటే భిన్నంగా వుండేది. రిప్రజెంటేటివ్‌లు అణకువగా వుంటే చాలు, వాళ్ళెంత ఫ్రాడ్ చేసినా పట్టించుకునేవాడు కాదు. రిప్రజెంటేటివ్‌లు జల్సాలు చేస్తున్నారని తెలిస్తే పిలిచి బూతులు తిట్టేవాడు. 'డబ్బు దాచుకోండిరా' అనేవాడు. అందర్నీ అరేయ్, ఒరేయ్ అనేవాడు. కోపం వస్తే దొంగనాకొడకా అని తిట్టేవాడు.

జయా కంపెనీలో రిప్రజెంటేటివ్‌లుగా పనిచేసి హైదరాబాద్‌లో ఇళ్ళు కట్టుకున్న వాళ్ళు, ఆడ పిల్లల పెళ్ళిళ్ళు చేసినవాళ్ళు చాలామంది వున్నారు. అంతా పార్థసారధి గారి చలువ అనేవారు.

రోజులన్నీ మనవి కావు. శోభనాద్రికి జల్సాల జీవితం ఎంతోకాలం సాగలేదు.

ఆ సంఘటన అతని జీవితాన్ని ఒక మలుపు తిప్పింది.

ఒకసారి ఖమ్మం కేంప్‌కి వెళ్ళాడు. సినిమా నాలుగు వారాలు ఆడింది. తిరుగు ప్రయాణంలో దురదృష్టం వెన్నంటింది. క్లబ్బుకి వెళ్ళి పేకాట ఆడడం మామూలే అయినా ఆఖరిరోజని తాహతుకి మించి పెద్ద ఆటలో కూర్చున్నాడు. పాయింట్‌కి రూపాయి, రెండు. కాలం కాటేసింది. తను ఫ్రాడ్ చేసిన వెయ్యికాక కంపెనీ డబ్బు



## మణిరత్నం కొత్త గెస్ట్!

మణిరత్నం తన చిత్రాల్లో గెస్ట్ పాత్రల్లో ప్రముఖుల్ని నటింపజేయటం మామూలే! ఆమధ్య 'బొంబాయి'లో సొనాలీ బెంద్రేచేత 'హమ్మా హమ్మా' అనే డాన్స్ చేయించిన మణి తన తాజా చిత్రం 'దిల్ సే'లో మరో కొత్తగెస్ట్‌ని తెరపైకి తీసుకొస్తున్నాడు. ఎంటీవీ ద్వారా పాపులర్ అయిన ప్రముఖ మోడల్ 'మాళైకా'ను 'దిల్ సే'లో గెస్ట్ పాత్రకి తీసుకున్నాడు మణిరత్నం. 'ఇరువర్' ఫ్లాప్ అయ్యాక డైరెక్టుగా హిందీలో మణిరత్నం ఎంతో కసిగా రూపొందిస్తున్న 'దిల్ సే...'పై జనాల్లో బోల్డన్ని ఆశలున్నాయి. అందుకే కాబోలు ఇలా అనేక ఆకర్షణలను నింపుతున్నట్లున్నాడు మణి. ఇంతకాలం బుల్లితెరపై చూసిన 'మాళైకా' అందాలు ఇక వైడ్ స్క్రీన్‌మీద కూడా చూడొచ్చన్నమాట.

-జె.ఎం.

నాలుగు వేలు పేకాటలో పోయాయి. గవర్నమెంటు గుమస్తాకి వంద రూపాయలు జీతం వుండే ఆ రోజుల్లో ఐదువేలంటే చిన్న మొత్తం కాదు. ఆ డబ్బుతో మధ్య తరగతి ఆడపిల్లకి కట్న కానుకలతో పెళ్ళయ్యేది.

సికింద్రాబాద్ వచ్చి కంపెనీ ముఖం చూళ్ళేదు. కంపెనీకెళ్తే వసూలు చేసిన పేర్ కట్టాలి. అప్పుకోసం కింగ్స్‌వేలో కనపడిన వారినల్లా అడిగాడు. సకల గుణాభిరాముడైన సోగ్గాడు శోభనాద్రికి అప్పెవరిస్తారు?

కంపెనీ డబ్బు పేకాటలో తగలేశాడని ప్రొప్రయిటర్‌కి తెలిస్తే బండబూతులు తిట్టడమే కాకుండా తన్ని మెట్ల మీద నుంచి దొర్లించేస్తాడని భయపడ్డాడు శోభనాద్రి. కంపెనీకి వెళ్ళడానికి భయపడిన అతగాడు ఒక ఫుల్ బాటిల్ విస్కీ సీసా తీసుకుని చీకటి పడ్డాక హుస్సేన్‌సాగర్ ఒడ్డున కూర్చున్నాడు. ఖైరతాబాద్ వెళ్ళేరోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఎవరూ శోభనాద్రిని పట్టించుకోలేదు. మందు ఎక్కువై కదల్లేక ఆటో కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.


ఆటో రాలేదు గాని ఆదిలక్ష్మి పరిగెత్తుకుంటూ వచ్చింది. హుస్సేన్ సాగర్లో దూకి చావాలని ఆమె ప్రయత్నం. ఆమెకొక కథ. ఆదిలక్ష్మికి తల్లిదండ్రులు లేరు. అన్న ఆధారం. ఇరవై ఏళ్ళు దాటిపోయినా అన్న పెళ్ళి చెయ్యలేకపోయాడు. వదిన ఆదిలక్ష్మిని కాల్చుకు తింటున్నది. ఏభైఏళ్ళ వెధవ వీరాస్వామిని పెళ్ళి చేసుకోమని రోజూ బలవంతం చేస్తున్నది. వదిన పోరుపడలేక ముసలోడికి పడుచుపెళ్ళాంగా జీవించడానికి ఇష్టపడక ఆమెకు జీవితం మీద విరక్తి కలిగి చావాలనుకుంది. అయితే తనను రక్షించడానికి దేవుడిలా శోభనాద్రి కాచుకుని వున్నాడని ఆమె కలలో కూడా వూహించలేదు.

ఆదిలక్ష్మి ప్రయత్నం పసిగట్టిన శోభనాద్రి గట్టిగా కేకలు పెట్టాడు. అతని కేకల్ని పట్టించుకోకుండా పోతున్న ఆమె వెంట శక్తికొద్దీ పరిగెత్తాడు. శోభనాద్రి కేకలు విన్న ఇద్దరు బీటుకానిస్టేబుళ్ళు వచ్చారు. బ్యాటరీ లైటు వెలుగులో ఒక యువకుడిని, ఒక యువతిని చూశారు.

ఆదిలక్ష్మి ఏడవడం తప్పించి నోరుమెదపలేదు. శోభనాద్రి డోసులో వున్నాడు. అంతకంటే అనుమానించడానికి విషయం ఏం కావాలి? పోలీసులు వాళ్ళిద్దర్నీ స్టేషన్‌కి పట్టుకుపోయారు.

మర్నాడు మత్తుదిగిన శోభనాద్రి తను జయాకంపెనీలో రిప్రజెంటేటివ్‌నని చెప్పుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ ఫోన్ చేస్తే పార్థసారథి స్వయంగా వచ్చాడు. శోభనాద్రి జరిగిందంతా నిజం చెప్పాడు.

మామూలుగా బుద్ధావతారంలా వుండే ఆదిలక్ష్మి అన్న నరసింహావతారం ఎత్తాడు. చెల్లెల్ని వదిలించుకునే ఛాన్స్ వచ్చిందని వూహించి చెలరేగిపోయాడు.




చెల్లెలు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళొస్తే ఇక దానికి జన్మలో పెళ్ళవుతుందా? అని నిలదీశాడు. వాళ్ళిద్దరికీ ఏదో సంబంధం వుందనీ, చాలాకాలంగా ఈ వ్యవహారం సాగుతున్నదనీ అభాండం వేశాడు.

ఏదో బాదరాయణ సంబంధం లాగా ఆదిలక్ష్మి తన మెడకు చుట్టుకున్నందుకు శోభనాద్రి ఖిన్నుడయ్యాడు. డబ్బుపోయి తను ఏడుస్తుంటే ఇదేమి పీడరా దేవుడా! అని ఏడ్చాడు.

డబ్బున్న వాళ్ళకి మనసుండదని నానుడి. కాని పార్థసారథికి డబ్బుతో పాటు మనసూ వుంది. ఆయన డబ్బుని లెక్క చేసే మనిషి కాదు. మనిషి డబ్బుని సంపాదిస్తాడు. డబ్బు మనిషిని సంపాదించ కూడదనేది ఆయన తత్వం. అందుకే శోభనాద్రి పేకాటలో కంపెనీ డబ్బు పోగొట్టినా క్షమించేశాడు.

''అరేయ్ శోభనాద్రీ! మనిషి డబ్బు పోగొట్టుకుంటే మళ్ళీ సంపాదించుకోగలడు. పరువుప్రతిష్ఠ కోల్పోతే తిరిగి సంపాదించుకోలేడు. ఆడపిల్లకి అది అసలే సాధ్యం కాదు. మంచో చెడో ఆ పిల్ల నీతోపాటు తెల్లవార్లూ పోలీస్ స్టేషన్లో వుంది. మీరిద్దరూ వ్యభిచారం చేయబోయారని పోలీసులు అనుమానించారు. మీకేదో సంబంధం వుందని ఆ పిల్ల అన్న అంటున్నాడు. నీతోపాటు ఆ పిల్ల బజార్లో పడింది. దాన్ని కాపాడే బాధ్యత నీదే. బాగా ఆలోచించుకో. రేపట్నుంచి ఆఫీసుకి తగలబడు.'' అని కారెక్కి వెళ్ళిపోయాడు పార్థసారథి.

తర్వాత శోభనాద్రికీ, ఆదిలక్ష్మికీ పార్థసారథే ఖర్చులు భరించి పెళ్ళి చేశాడు.

ఇక ఆ తర్వాత సోగ్గాడు శోభనాద్రిని కింగ్స్‌వేలో ఎవరూ చూళ్ళేదు. సిద్ధార్థుడే బుద్ధుడైనట్లుగా సోగ్గాడు సంసారిగా మారిపోయి మొండా నుంచి కూరగాయలు తెస్తూనో, కిరాణా కొట్లో సరుకుల సంచితోనే మిత్రులకు దర్శనమిచ్చేవాడు. ఇక గాలిలో తేలడం కట్టిపెట్టి సంసార సాగరం ఈదుతూ కాలం గడిపాడు.

★★★

శోభనాద్రి తుది శ్వాస విడిచాడు. కూతురు తండ్రి శవం మీద పడి భోరున విలపించింది. కోడళ్ళు ముక్కులు చీదుతున్నారు. కొడుకులు చేతులతో ముఖాలు కప్పుకుని దుఃఖించారు.

చివరి రోజుల్లో ముసలాయన లాయర్ని పిలిపించి వీలునామా రాయించడం ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు తెలియని ఆస్తిపాస్తులు, బ్యాంకు బేలన్సులు వున్నాయేమో? అవి తమకి చెందాల్సిందిగా భాగాలు వేసి వీలునామా రాయించాడేమోనని కొడుకులకు ఆశ కలిగింది. అల్లుడు, కూతురు కుతూహలంతో వున్నారు.

''శోభనాద్రి పోగానే నాకు కబురు చేయండి. వచ్చి వీలునామా చదువుతాను'' అని ముందే చెప్పి వెళ్ళాడు లాయర్ విశ్వనాథం.

అల్లుడు ఫోన్ చేయగానే లాయర్ వచ్చి అందరి ముందూ వీలునామా చదివాడు.

''నేను చనిపోయాక నా కళ్ళు ఐ బ్యాంక్‌కి డొనేషన్‌గా ఇస్తున్నాను. ఇక నా శరీరాన్ని స్టూడెంట్స్ పరిశోధనలకు వుపయోగపడేట్లుగా మెడికల్ కాలేజీకి తరలించ వలసిందిగా నా కొడుకులను కోరుతున్నాను. అంతేకాదు. నాకు చిన్న కర్మ, పెద్ద కర్మ అనే కార్యక్రమాలు చేయగూడదు. మొహమాటానికి పోయిగాని, ఎవరేమనుకుంటారోననే భయంతోగాని నా శవాన్ని కాల్చడం, కర్మకాండలు నిర్వహించడం చేస్తే నా ఆత్మక్షోభిస్తుందని గుర్తుంచుకోండి.''

ఇట్లు
శోభనాద్రి

★

## వర్మ 'థ్రిల్లర్'



ఆమధ్య రామ్‌గోపాల్ వర్మ తీసిన 'రాత్రి' చిత్రం అదరగొట్టేస్తుందనుకున్నారు. కానీ దారుణంగా పరాజయాన్ని చవిచూసింది. ఆ తర్వాత వర్మే తీసిన మరో హారర్ చిత్రం 'దెయ్యం' కూడా పరాజయాన్ని ఎదుర్కొంది. కానీ మంచి స్పిన్ చిల్లింగ్ సస్పెన్స్‌తో హారర్ చిత్రాన్ని తీసి హిట్ చేయాలనే తపన అతనిలో పెరుగుతూనే వుంది అనడానికి తాజా నిదర్శనం వర్మ రూపొందిస్తున్న 'కౌన్' హిందీ చిత్రం. కేవలం నాలుగు శవాల చుట్టూ కథ నడుస్తుందిట. ఓ టీవీ యాంకర్, టెలిఫోన్‌లో ఓ వ్యక్తి గొంతు..ఇలా అతి తక్కువ పాత్రలతో హిచ్‌కాక్ థ్రిల్లర్‌లా తీయాలనుకుంటున్నాడు వర్మ. అన్నట్టు తెలుగులోకి ఇది అనువాదం అవుతుంది లెండి. మరి ఎలాంటి థ్రిల్ కలుగుతుందో చూడాలి!

-జె.ఎం.